సూర్య కలర్స్ Life is A Rainbow

పధ్నాలుగు సంవత్సరాల సుదీర్ఘ కాలానంతరం మహిళా దినోత్సవం మరుసటి రోజున 'మహిళా రిజర్వేషన్ బిల్లు' ఎగువ సభలో ఆమోదాన్ని పొందడం ఒక చారిత్రక ఘట్టం. ఎన్నో మార్లు సభలో ఆటంకాలను ఎదుర్కొన్న ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే దేశ విధాన నిర్ణయాలలో వచ్చే మార్పు ఊహించలేనిది. పంచాయితీరాజ్‌లో మహిళలకు రిజర్వేషన్ల పుణ్యమా అని పల్లెలు మానవీయ అభివృద్ధిని చవి చూస్తున్నాయి. పురుషుల దృక్పథంలోనూ మహిళల పట్ల మార్పు కనిపిస్తున్నది. సాధికారత దిశగా అడుగులు వేస్తున్న మహిళలకు ఇది ఘన విజయం. బిల్లులో ఉపకోటాను కూడా కల్పించి ఉంటే సామాజిక న్యాయ సాధన దిశగా తొలి అడుగు పడి ఉండేది. సర్వజనామోదయోగ్యమై ఉండేది.



# సాధికారతా శిఖరం

స్వాతంత్ర్య సమరం నాటి నుంచి పురుషులకు దీటుగా మహిళలు చురుకుగా రాజకీయ కార్యకలాపాలలో పాల్గొం టున్నారు. కానీ వాస్తవాధికారాన్ని అందుకున్నది కొందరు మాత్రమే! వారిలో కూడా వారసత్వ పరంపరలో వచ్చిన వారే ఎక్కువ కావడం కొంత నిరాశ కలిగించే మాట వాస్తవం. జనాభాలో సగ భాగం ఉన్న మహిళల్లో వేళ్ళపై లెక్కపెట్టగల వారు మాత్రమే అధికార పదవులను అలంకరించారు. అందుకే రాజకీయాలలో మహిళలకు రిజర్వేషన్లు అన్న అంశం తెరపైకి వచ్చింది. పధ్నాలుగు సంవత్సరాల పాటు గ్రహణం పట్టిన ఈ బిల్లు ప్రస్తుతం చట్ట రూపం దాల్చబోతున్నది. ఇంత కాలం ఎంతో ఓపికగా వాస్తవ రాజకీయ అధికారం కోసం ఎదురు చూస్తున్న మహిళల స్వప్నం సాకారం కాబోతున్నది. ముఖ్యంగా దేశానికి రాష్ట్రపతి, తొలి పౌరుడు ఒక మహిళ కావడం, పార్లమెంటు స్పీకర్, పాలక పక్ష పార్టీ అధినేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత మహిళలే అయిన తరుణంలో ఈ బిల్లు చట్టరూపం దాల్చనుండడం మహిళా శక్తికి నిదర్శనంగానే చెప్పుకోవాలి. మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహా మహులతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో తొలితరం మహిళా రాజకీయ నాయకురాళ్ళు విజయలక్ష్మి పండిట్, రాజ్ కుమారి అమృత్ కౌర్, అరుణా అసఫ్ ఆలీ, సరోజిని నాయుడు వంటి వారు సేవలు అందించారు. అయితే కీలక బాధ్యతలు చేపట్టింది మాత్రం రెండవ తరం నాయకురాళ్ళే.

రెండవ తరం రాజకీయ మహిళలు 1960, 1970లలో ఇందిరా గాంధీ నాయకత్వంలో ప్రభుత్వంలో కీలక బాధ్యతలను చేపట్టడం ప్రారంభించారు. నందిని సత్పతి, అనంతరం మార్గరేట్ ఆల్వా వంటి మహిళలు రాజకీయాలలో తమదైన ముద్ర వేసి, అవకాశం వస్తే తమకిచ్చిన బాధ్యతలను ఎంత నిబద్ధతతో నిర్వర్తించగలరో చేసి చూపారు. అయితే మహిళల రాజ కీయ ముద్ర ఎంత కటువుగా, కఠినంగా ఉండగలదో ఎమర్జెన్సీ కాలంలో నియంతలా ప్రవర్తించిన ఇందిరా గాంధీ చూపా రు. తదనంతర కాలంలో నజ్మా హెప్తుల్లా, రాజమాత విజయారాజె సింధియా, సుష్మా స్వరాజ్, జయ లలిత, మమతా బెనర్జీ, మాయావతి, సోనియా గాంధీ, మేనకా గాంధీ వంటి అనేక మంది మహిళా నాయకులు తెరపైకి వచ్చారు. భారత రాజకీయ యవనికపై వారి ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. అయినప్పటికీ లోక్‌సభ, రాజ్య సభలలో మహిళల ప్రాతినిధ్యం పదిహేను శాతం కూడా చేరుకోలేదు.

ఇదంతా జాతీయ స్థాయిలో జరుగుతున్న కథ. గ్రామీణ స్థాయిలో నిశ్శబ్ద విప్లవం చోటు చేసుకుంటున్నది. క్షేత్ర స్థాయిలో మహిళా రాజకీయ నాయకత్వం ఒక వాస్తవిక అవుతున్నది. పంచాయితీ రాజ్ సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కారణంగా గ్రామీణ స్థాయిలో తీసుకునే నిర్ణయాలపై వారు ప్రతిభావంతమైన ముద్ర వేయగలు గుతున్నారు. ఎదుగు తున్న ఈ నాయకులు రాష్ట్ర, జాతీయ చట్ట సభలలో తమ ప్రాతినిధ్యం కోసం ఆరాటపడుతున్నారు. ఈ నేపథ్యంలో చట్ట సభ లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అత్యవసరమవుతు న్నాయి. ఇప్పటికే అనేక నగర కార్పొరేషన్లకు, గ్రామ పంచాయి తీలకు, మున్సిపాలిటీలకు మేయర్లుగా, చైర్మన్‌లుగా, సభ్యులుగా మహిళలు రాణిస్తున్నారు. వీరంతా అంతగా చదువుకున్న వారు కాకపోయినప్పటికీ వారి బాధ్యతల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం ఒక మంచి పరిణామం. తమకు కల్పించిన రిజర్వేషన్ల కారణంగా రాజకీయంగా మరింత చైతన్యవంతులైనట్లు వారు చెబుతున్నారు. ఆత్మవిశ్వాసంతో సర సన ఉన్న పురుషుడికే అసూయ కల్పించేలా ఎదుగుతున్న ఈ మహిళలు, ఇంట్లో కూడా గౌరవాన్ని పొందడం విశేషం.




పురుషాధిక్యతతో కూడిన రాజకీయ రంగంలో ఎంతో తెలివిగా దూసుకుపోతున్న మహిళలు, బాగా పనిచేసే వారిని పురు షులు అణచివేయలేరని ఆత్మవిశ్వాసంతో ప్రకటిస్తున్నారు. రిజర్వేషన్లు కల్పించకపోతే తాము ఈ స్థితికి రావడం ఎంతో కష్టమయ్యేదని అంగీకరిస్తున్న మహిళలు, తమకిచ్చిన బాధ్యతలను ఎంతో గొప్పగా నిర్వర్తించడం అభినందించవలసిన విషయం. రాజకీయాలలోకి రావడమంటే రోడ్డున పడటమే అన్న భావన నుంచి బయటపడి లక్షలాది మహిళలు క్షేత్ర స్థా యిలో రాజకీయాలలో పనిచేస్తూ, అపూర్వమైన ఫలితాలను అందిస్తున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన అర్ధ శతాబ్దానికి పైగా గ్రామీణ ప్రాంతాలలో పరిష్కృతం కాని సమస్యలు మహిళల రాకతో పరిష్కారం కావడం ఎంతైనా అభినందించదగ్గ విష యం. మహిళలు రాజకీయాలలో ఉన్నప్పటికీ పెత్తనం పురుషుడిదే అన్న వాదన కొంత వరకూ వాస్తవం కావచ్చు. అయితే దానిని అధిగమించిన అనేక మంది మహిళలు ముందుకు దూసుకుపోతున్నారు.

తల్లిగా, భార్యగా కుటుంబాన్ని నడిపే స్త్రీకి రాజకీయాలు సరైన బాధ్యతే అని చెప్పాలి. అక్కడా, ఇక్కడా ఇతరుల సంక్షేమమే ప్రధానంగా నిలిచే అంశం. పైగా క్షేత్ర స్థాయిలో వారు చేసే పని పూర్తి సమయాన్ని తినివేయదు కనుకనే అక్కడ ఒక గొప్ప విప్లవం ప్రారంభమైంది. వీటితో పాటుగా ప్రభుత్వం అమలు చేసే పథకాలు కూడా మహిళల్లో ఎంతో చైతన్యాన్ని పెం చా యి. నేడు గ్రామీణ ప్రాంతాలలో స్వతంత్ర, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా మహిళా నాయకులు జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఒక అపురూప దృశ్యం. గ్రామీణ ప్రాంతాలలో మహిళల పట్ల వివక్ష రూపు మాస్తూ ఉండడం ఒక శుభ పరిణామం. పురుషులు తమ భార్యలు రాజకీయాలలో పాల్గొనడం, నాయకత్వం వహించడాన్ని జీర్ణం చేసుకోవడమే కాదు, వారిపై పెత్తనం చేయడం కూడా తగ్గుతున్నది. తమ గ్రామాల అభివృద్ధిలో పాలు పంచుకోవడం తమకెంతో గౌరవప్రదమైన అంశంగా నేడు ఈ క్షేత్ర స్థాయి మహిళా నాయకురాళ్ళు పేర్కొంటున్నారు. ఆర్థిక అంశాలలో పురుషులు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించబోయినా, మహిళలు కలిసికట్టుగా ఒత్తిడి తెచ్చి ప్రతిపాదిత సంస్కరణలు అమలయ్యేలా పని చేస్తున్నారు. తాము రాజకీయాలలో ప్రవేశించిన కారణంగా తమకు సామాజిక గౌరవం, కొత్త అంశాల గురించి, అవగాహన, ఆత్మగౌరవం పెరగడమే కాక తాము కూడా జాతి నిర్మాణంలో పాలుపంచుకుంటున్న భావన కలిగిందని అనేకమంది మహిళలు పేర్కొం టున్నారు. అలా అని అంతా సానుకూలంగా ఉన్నదనీ చెప్పలేం. బడుగు, బలహీన వర్గాల మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు విస్మరించలేనివి. అందుకే కోటాలో ఉపకోటా డిమాండ్ పుట్టింది. సామాజిక న్యాయ కోణాన్ని విస్మరించకుండా ప్రస్తుత మహిళా రిజర్వేషన్ బిల్లును రూపొందిస్తే అన్ని వర్గాలకూ మేలు చేసిన వారవుతారు.

ఏదిఏమైనా గ్రామీణ మహిళా రాజకీయ నాయకులు చూపుతున్న ఫలితాలు అనుసరణీయమైనవి. గ్రామ స్థాయిలో జరు గుతున్న అభివృద్ధికి వీరు కీలకంగా ఉంటున్నారు. ఇది భవిష్యత్తుకు ఒక శుభ సూచికగా భావించాలి. దేశంలో సుమారు 86 లక్షల గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయితీలో కనీసం ఇద్దరు చొప్పున మహిళా సభ్యులను లెక్క వేసుకున్నా వివిధ దేశాలలో రాజకీయ బాధ్యతలు నిర్వహిస్తున్న వారిలో మన వారి సంఖ్య చెప్పుకోతగ్గదిగానే ఉన్నది. ఈ పరిస్థితుల్లో లోక్‌సభలో రిజర్వేషన్లు అన్నది సహజ పరిణామ క్రమంలో భాగంగానే పరిగణించాలి. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదాన్ని ఒక చారిత్రక ఘట్టంగానే పరిగణించాలి.

– డి.ఎ.











# మహిళా శక్తి

మానవ శక్తి అందరికీ సొంతం. కానీ మహిళాశక్తి మహిళకే సొంతం.

ఇప్పటివరకు ఐదుగురు మహిళలు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ రథసారథులుగా వ్యవహరించారు. వారిలో ఎక్కువమంది విదేశీవనితలే ఉన్నారు. అనిబిసెంట్ హోంరూల్ ఉద్యమంలో బాలగంగాధర్ తిలక్‌తో వివిధ ప్రాంతాల్లో పర్యటించి స్వరాజ్యంకోసం పాటుపడినారు. ఈమె... అక్టోబర్1, 1847లో లండన్‌లో జన్మించారు. ఈమె మహిళల హక్కులకోసం సుదీర్ఘ పోరాటం చేశారు. అనిబిసెంట్ మంచి రచయిత కూడా. ఆమె రాసిన ఎన్నో రచనల్లో ఆధ్యాత్మికతతో పాటు భారతీయ చింతన కనపడుతుంది. అనిబిసెంట్ తరువాత నిల్లిసేన్‌గుప్తా అధ్యక్ష పదవిని చేపట్టింది. ఈమె కూడా విదేశీయురాలే. కేంబ్రిడ్జిలో 1886 లో పుట్టిన సేన్ 1933లో అధ్యక్షురాలిగా ఉన్నారు. సేన్ తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పీఠాన్ని తొలిసారిగా ఓ భారతీయురాలు అధిష్టించింది. ఆమే సరోజినీ నాయుడు. ఫిబ్రవరి 13, 1879లో హైద్రాబాద్‌లో పుట్టిన సరోజిని ఓ బెంగాలీ. ఆమె రచయిత, స్వాతంత్ర్య సమరయోధురాలు. సరోజిని తరువాత ఐరన్‌లేడీగా రాజకీయాల్లో పేరు సంపాదించిన ఇందిరాగాంధీ రెండుసార్లు అధ్యక్షురాలి పదవిలో కొనసాగింది. ఇందిర మరణం తరువాత మళ్లీ ఓ విదేశీ సంతతికి చెందిన వ్యక్తి సోనియాగాంధీ 1998లో అధ్యక్ష పదవిని చేపట్టింది. 1946 డిసెంబర్ 9న ఇటలీలో జన్మించిన సోనియా మొదట్లో రాజకీయాలకు చాలా దూరంగా ఉన్నారు. రాజీవ్‌గాంధీ మరణం తరువాత కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో ఆమె రాజకీయాల్లో అడుగుపెట్టారు. పార్టీని బలోపేతం చేయడంలో ఆమె పాత్ర కీలకమైనది. అంతేకాదు ఈ అధ్యక్ష పదవిలో ఎక్కువకాలం కొనసాగుతోన్న వ్యక్తిగా, మహిళగా.. ఆమె రికార్డుని సృష్టించారు.

### ప్రపంచ రాజకీయాల్లో మహిళాశక్తిని ప్రభావితం చేసిన టాప్ 10 స్త్రీలు

- ★ సుబత్యాన్ యాన్‌జామా (మంగోలియా) – ప్రెసిడెంట్ యాక్టింగ్
- ★ సిరిమావో బండారే నాయకే (శ్రీలంక) – ప్రధానమంత్రి
- ★ ఇందిరాగాంధీ (భారతదేశం) – ప్రధానమంత్రి
- ★ హిల్‌దా గిబ్స్ బ్యో (గ్రెనాడా) – గవర్నర్
- ★ గోల్డా మేయర్ (ఇజ్రాయిల్) – ప్రధానమంత్రి
- ★ మారియా ఇసాబెల్ పెరాన్ (అర్జెంటైనా) – అధ్యక్షురాలు
- ★ ఇలాసాబెత్ దొమెన్‌థిన్ (ఆఫ్రికా రిపబ్లిక్) – ప్రధానమంత్రి
- ★ గోమెజ్ మెథ్యూ (నెదర్లాండ్స్) – ప్రధానమంత్రి
- ★ దోరి లూయి జాన్సన్ (బహమస్) – గవర్నర్ జనరల్ యాక్టింగ్
- ★ లాదాయ్ జెవిలర్ తెజడా (బొలివియా) – ప్రెసిడెంట్ యాక్టింగ్

### యూనిసెఫ్ భారత్‌లో మహిళలపై చేసిన సర్వే...

- భారత్‌లో గర్భస్థ శిశుహత్యలు, బాలికల్లో మరణాల రేటు ఎక్కువగా ఉండడం వల్ల ఐదు కోట్ల మంది బాలికలు, మహళలు అదృశ్యమవుతున్నారు.
- వ్యవసాయేతర ఉపాధిలో మహళలు 17 శాతమే.
- పట్టణ శ్రామికశక్తిలో మహళలు 13.9 శాతం.
- గ్రామాల్లో 29.9 శాతం పురుషుల వేతనాల్లో 75 శాతమే స్త్రీలకు ఇస్తున్నారు. కుటంబ ఆదాయంలో మహిళల వాటా 25 శాతమే. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ స్త్రీ – పురుషులకు సమానవేతనాలు లేవు.
- హైకోర్టు న్యాయమూర్తులుగా నాలుగు శాతం, యాజమాన్య ఉద్యోగాల్లో మూడు శాతం మహిళలున్నారు.
- 24.5 కోట్లమంది భారత మహిళలకు చదవడం, రాయడం రాదు.
- మహిళలకు సగటున రోజుకు 2200 కాలరీల శక్తి అవసరం అయితే 1400 కాలరీలనిచ్చే ఆహారాన్ని మాత్రమే తీసుకుంటున్నారు.
- 92 శాతం మంది మహిళలు స్త్రీ సంబంధ వ్యాధులకు గురవుతున్నారు.
- రోజుకు 300 మంది మహిళలు ప్రసూతి లేదా సంబంధిత కారణాలతో మరణిస్తున్నారు.

### ప్రపంచ మహిళ స్థితిగతులు...

- ప్రతి ఏటా ఐదు లక్షల మంది మహిళలు గర్భ సంబంధమైన సమస్యలతో మరణిస్తున్నారు.
- లక్షమంది యువతులు అబార్షన్లతో ప్రాణాలు కోల్పోతున్నారు.
- పశ్చిమ ఐరోపాలో ఒక గర్భిణీ స్త్రీ మరణిస్తే ఆఫ్రికాలో 180 మంది చనిపోతున్నారు.
- అమెరికాలో ప్రతి 18 నిమిషాలకు ఒక మహిళ దెబ్బలు తింటున్నది. ప్రతి ఆరునిమిషా ఒకరు అత్యాచారానికి గురవుతున్నారు.
- కారు ప్రమాదాలు, అత్యాచారాలు ఇతర సందర్భాల్లో కంటే గృహహింసలువల్ల మహిళలు ఎక్కువగా బాధపడుతున్నారు.
- ఫ్రాన్స్‌లో జరిగే హింసాకాండలో బాధితులు 95 శాతం ఉన్నారు అయితే అందులో 51 శాతం మంది భర్తల చేతుల్లో దెబ్బలు తింటున్నవాళ్లే.
- ప్రపంచవ్యాప్తంగా నూటికి 20 నుంచి 50 మంది వరకు వివాహాల సందర్భంగా మహిళలు గృహహింసకు గురవుతున్నారు.
- పుట్టబోయేది ఆడపిల్ల అని తెలుసుకునేందుకు గాను జన్యుపరమైన లోపాల పేరుతో అనేక దేశాల్లో పరీక్షలు చేయిస్తున్నారు.
- ప్రపంచంలో వందకోట్లకు పైగా నిరక్షరాస్యులైన వయోజనుల్లో మూడింట రెండువంతుల మంది మహిళలే. అందులో ఎక్కువమంది గ్రామీణులే ఉన్నారు.
- పద్దెనిమిది సం॥ల వయస్సువచ్చే సమయానికి అబ్బాయిల కంటే అమ్మాయిలు సగటున 4.4 సం॥ల విద్యను తక్కువ పొందుతున్నారు.
- అమెరికాలో దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న వనితలు 71 శాతం మంది ఆఫ్రో అమెరికన్‌లే.
- ప్రపంచంలో తొమ్మిదేళ్ల లోపు వయస్సులో మరణిస్తున్న బాలికల్లో 17.6 శాతం మంది శ్వాసతీసుకోవటంలో వస్తున్న జబ్బులే కారణం.
- అధికాదాయం ఉన్న దేశాల్లో 10–19 ఏళ్ల వయసున్న బాలికల మరణాలకు రోడ్డు ప్రమాదాలు 28.9 శాతం కారణం.
- ప్రపంచంలో పిల్లలు కనే వయసులో ఉన్న మహిళల్లో మరణాలకు 19.2 శాతం ఎయిడ్స్ కారణం అవుతుంది.
- ప్రపంచంలో పురుషుల కంటే మహిళల్లో సగటు జీవితకాలం ఎక్కువగా ఉండటానికి శారీరక, మానసిక ప్రవర్తనే కారణం. మహిళలకు శారీరకంగా ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నప్పటికీ.. లింగవివక్ష కారణంగా రోగాల పాలైనపుడు తగిన చికిత్స చేయించని కారణంగా మరణిస్తున్నారు.
- ఇండియాలోని మహిళ ఆయుష్షు పురుషుల కంటే ఎక్కువ. రాబోయే కాలంలో వనిత ఆదాయం కూడా పెరుగుతుంది.
- మహిళా సాధికారత విషయంలో ఐరోపా, అమెరికా దేశాలు ముందున్నాయి. అయితే అక్కడ ఉన్నత పదవులని చేపట్టడంలో వనిత వెనపడే ఉంది. అదే భారత్, పాకిస్థాన్, శ్రీలంక, ఇండోనేషియాల్లో చూసుకుంటే ఎంతోమంది ఉన్నత పదవులని అధిష్టించారు.
- 1950వ దశకం నుంచి రాజకీయంలో మహిళ పాత్ర... పెరిగింది.

